# సీసీసీ నుంచి ఎన్నికల పరిశీలన

**సీపీ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో పరిశీలకులుగా విజయ్ వినాయక్, దీపక్ మిశ్రాలు**



సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీఎస్-ఐసీసీసీ) నుంచి పోలింగ్ సరళిని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య నేతృత్వంలో ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు విజయ్ వినాయక్, దీపక్ మిశ్రాలు పరిశీలించారు. నగరంలో ఉన్న పోలింగ్ స్టేషన్లతో అనుసంధానం చేసిన 6 వేల సీసీ కెమెరాల ద్వారా పరిశీలించడం, అలాగే, డ్రోన్ కెమెరాల ద్వారా బయట పరిస్థితులను ఎప్పకటిప్పుడు గమనిస్తూ క్షేత్ర స్థాయిలో ఉన్న పోలీసులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఎన్నికల విధులను ఎలా నిర్వహిస్తున్నారనే విషయాన్ని స్వయంగా ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. క్షేత్ర స్థాయి నుంచి టెక్నాలజీని ఉపయోగించి నగర పోలీసులు నిర్వహిస్తున్న విధుల గురించి సీపీ వారికి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద తీసుకుంటున్న చర్యలను అధికారులు పరిశీలించారు. జాయింట్ సీపీ పరిమళ హన నూతన్, డీసీపీలు పుష్ప, రాదేష్ మురళీ, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్-ఎంఐఎం పార్టీల మధ్య ఘర్షణ

*లాఠీచార్జ్ చేసిన సైదాబాద్ పోలీసులు*

సైదాబాద్, నవంబర్ 30: ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీల మధ్య గురువారం సాయంత్రం సైదాబాద్ బాకర్‌బాగ్ పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ జరిగింది. రెండు పార్టీల నాయకులు ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద పరస్పరం ఎదురుపడటంతో స్వల్ప ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఎన్నికల సమయం ముగిసిన తర్వాత పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ ప్రయత్నాలు చేయగా, పోలీసులు, ఎంఐఎం పార్టీ నాయకులు అడ్డుకోవటంతో, ఈ క్రమంలో వారి పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలను గమనించిన వారు అక్బర్‌పై ఎంఐఎం పార్టీకి చెందిన నాయకులు ఘర్షణకు పాల్పడ్డే ప్రయత్నాలు చేయటంతో పోలీసులు వారిపై లాఠీచార్జి చేశారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులను అక్కడి నుంచి తరిమివేసి, పరిస్థితి చక్కదిద్దారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ మాట్లాడుతూ పోలీసులు చూస్తుండగానే ఇద్దరు వ్యక్తులు తనపై దాడికి పాల్పడ్డారని, వారి నుంచి తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని ఆయన పోలీసులను కోరారు. తనపై జరిగిన దాడిని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.



దోమలగూడలోని పోలింగ్ కేంద్రంలో గురువారం ఓటు హక్కును వినియోగించుకున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండురంగ నాయక్

**- సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ)**

## పోలింగ్‌ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి

*మేడ్చల్ జిల్లాలో ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్ గౌతమ్*

మేడ్చల్, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పోలింగ్ పరిస్థితులను మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లా కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షించారు. పోలింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఉండేలా ఎప్పటికప్పుడు అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్‌లు పర్యవేక్షించారు. శామీర్‌పేట్ మండలం అంతాయిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన 171వ పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం, తూముకుంట మున్సిపాలిటీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 169 పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తూముకుంటలో ఉన్న 8 పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ వివరాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అంతాయిపల్లిలోని 171 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ గౌతమ్



మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త



ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని మారుతీనగర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి, సతీమణి దేవిరెడ్డి కమలారెడ్డి, కుమారుడు ప్రీతం రెడ్డి, గౌతంరెడ్డిలు

## విజయం.. మళ్లీ మనదే..

**మంత్రి చామకూర మల్లారెడ్డి**



కీసరలో ఎన్నికలను పరిశీలనకు విచ్చేస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర, నవంబర్ 30: రాష్ట్రంలో మళ్లీ మనదే విజయం అని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి హ్యాట్రిక్ సాధిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. గురువారం జరుగుతున్న ఎన్నికలను మంత్రి కీసరకు వచ్చి స్వయంగా పరిశీలించారు. ఓటర్లకు మంత్రి దండం పెట్టడం జై మల్లన్న అంటూ భారీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం మధ్య ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు తలెత్తకుండా ఈ ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించారన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఓటర్ల నుంచి తనకు ఆపూర్వ స్పందన లభించిందన్నారు. ఈసారి కూడా తనను మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పథకాలే రాష్ట్రంలో మళ్లీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రధాన కారణమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి తూముల సునీత వెంకటేశ్వర్ రావు, కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేశ్‌లతో పాటు పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.



## 'చామకూర, తోటకూర'ల కరచాలనం

బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో గురువారం ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ తారసపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో తారస్థాయిలో విమర్శలు చేసుకున్న చామకూర, తోటకూర ఒకరికొకరు నవ్వుతూ కరచాలనం చేసుకుని పలకరించుకున్నారు. పక్కన స్థానిక మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ తదతరులు ఉన్నారు.

**-బోడుప్పల్, నవంబర్ 30**



తమ ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు

## జిల్లాలో కొనసాగుతున్న తనిఖీలు

**రూ. 87.27 కోట్ల నగదు సీజ్**

సిటీబ్యూరో, నవంబరు 30(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల తనిఖీలు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా జరిపారు. గురువారం ఒక్కరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.10,20,150ల నగదు సీజ్ చేయగా, ఇప్పటి వరకు మొత్తం రూ.5,05,85,620లు నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఆథారిటీ ద్వారా రూ.54,03,586 నగదు సీజ్ చేయగా, ఇప్పటి వరకు రూ.87,27,28,338 నగదును సీజ్ చేశారు. ఎఫ్ఐఆర్‌లు 1000 నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 4,650 నక్కాస్ ఆపరేషన్స్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కింద ఫ్లయింగ్ స్క్వాడ్ అంబర్‌పేటలో-3, సికింద్రాబాద్-1, ఖైరతాబాద్-2, ముషీరాబాద్-1, నాంపల్లి, చార్మినార్-1, బహదూర్‌పురా- 1 నమోదయ్యాయని అధికారులు తెలిపారు.